# లేసు తెర

## కాకాని కమల




ఇల్లంతా చెత్తగా ఉంది. బూజులు వ్రేలాడుతున్నాయి. సామాన్లు కూడా సరిగా సర్దుకోలేదు. ఈ క్వార్టర్స్‌కి వచ్చి ఇరవై రోజులు అవుతోంది. ఇంకా సరైన పనిమనిషి దొరకలేదు. నాకు పగలంతా ఆఫీసు. ఇంటికి వచ్చేసరికి బద్ధకం. అలసట... ఈ రోజు ఆదివారం కావటంతో ఇల్లు సర్దుదామని పని మొదలుపెట్టాను. అసలు కొన్ని సామాన్ల ప్యాకేజి విప్పలేదు. స్టోర్ రూమ్‌లో పడేశాను. ముఖ్యమైనవి మాత్రమే తీసి వాడుతున్నాను.

చెక్కపెట్టెలో కట్టిన సామాన్లు బయటికి తీస్తుంటే చిన్న ప్లాస్టిక్ కవర్ కనిపించింది. దానిలో పెద్ద లేసు తెర. గుమ్మాలకి పైనుంచి సగందాకా ఆర్చిలాగా వుండే తెల్లని దారాల లేసు తెర. తెరకు అటు ఇటు రెండు నెమళ్లు పురివిప్పిన డిజైన్.

ఆ తెరని చూడగానే నాకు సీతమ్మగారు జ్ఞాపకం వచ్చింది. తెల్ల జుట్టు, పొట్టిగా, బక్కగా ఉండేది. నేత చీరలు కట్టుకుని చేతుల నిండా మట్టిగాజులు. నుదుట పెద్ద కుంకుమ బొట్టు. మనిషి రంగుగా కళగా వుండేది. మెళ్లో పచ్చని నూలు తాడు వేసుకుని చింతాకు మంగళసూత్రాలు. నల్లపూసల దండలు చేతి దాకా కట్టుకునేది. పేరుకి తగినట్టే కళ గల రూపం. సీత పేరు పెట్టుకున్న వాళ్లు కష్టాలు పడతారంటారు. ఆవిడ్ని చూస్తే నిజం అనిపిస్తుంది.

ఆవిడ వయసు 60 ఏళ్లు నిండాయి. అయినా కష్టజీవి. రెక్కాడితేనే డొక్కాడుతుంది. భర్త బ్రతికే ఉన్నాడు. కానీ దేశ ద్రిమ్మరి. ఏదో ప్రైవేటు ఉద్యోగం చేసేవాడట.



రిటైర్ అయ్యాక ఊళ్లు తిరుగుతాడట. పెళ్లాం పిల్లల్ని పట్టించుకోడు. ఎప్పుడన్నా ఇంటికి వచ్చినా సుబ్బరంగా తింటాడు. కానీ ఖర్చు పెట్టడు. ఎలా బ్రతుకుతున్నావ్ అని అడగడు. "నా ఖర్మ. ఎప్పుడో పాపం చేసి ఉంటాను" అనేది ఆవిడ దిగులుగా.

ఆవిడకి ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు కోడలు దగ్గర ఉంటుంది. వాళ్లవి చిన్న ప్రైవేటు ఉద్యోగాలు. ఎనిమిది వందలు పెట్టి అద్దె ఇంట్లో ఉంటారు. కోడలుకి, అత్తకి పడదు. కొడుకు పెళ్లాం మాట వింటాడట. "సరిగా నాతో కూడా మాట్లాడడండి. వాడు నన్ను అమ్మా అని పిలిచి ఎన్నాళ్లు అయ్యిందో. ఏదన్నా చెప్పవలసి వస్తే పెళ్లానికి చెప్తాడు. అది నాకు చెప్తుంది" అంది సీతమ్మగారు ఒకసారి నాతో.

నాకు ఆశ్చర్యం వేసింది.

"నన్ను ఫో ఫో... అంటాడు. ఎక్కడికి పోతాను ఈ వయసులో" అంది.

చిన్న బిజినెస్ మొదలెట్టింది. ఒక షాపు నుంచి చిప్స్, బిస్కెట్స్, మురుకులు, చిక్కి లాంటివి రకరకాల ప్యాకెట్లు తెస్తుంది. అవి అమ్మితే ప్యాకెట్టుకి అర్ధరూపాయి కమీషన్ ఇస్తారట. మళ్లీ అప్పడాలు వత్తుతుంది. కొందరు ఇళ్లవాళ్లు వరుసగా అప్పడాలు ఆవిడ దగ్గరే తీసుకుంటారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటలదాకా వీధులన్నీ తిరుగుతుంది. పెద్ద రెండు సంచుల నిండా సరుకులు పట్టుకుని చెరో చేత్తో బరువులు మోస్తూ ఇంటింటికి వెడుతుంది. అవసరం లేకపోయినా ఆవిడపై జాలితో వాటిని కొంటారు ఆ వీధి వాళ్లు. ఆ ఆదాయం ఇంట్లో ఖర్చు పెడుతుంది.

"బెల్లంగెడ్డలు(డబ్బు) ఇంట్లో వేస్తున్నాగా. లేకపోతే పొమ్మంటుంది నా కోడలు" అనేది చిరునవ్వుతో సీతమ్మ గారు "ఈ వయసులో కూడా ఈ బరువులు మోస్తూ రోడ్లు తిరుగుతున్నారా?" అని ఎవరన్నా అడిగితే. ఇక ఆవిడ రెండో కొడుకుని గురించి ఆవిడ చెప్తే మనసు విరిగిపోతుంది. ఆ రాత్రికి ఇంక నిద్రపట్టదు. తిండి

సయించదు.

సీతమ్మ రెండో కొడుకు బ్యాంకు ఉద్యోగిట. అతనికి పెళ్లి అయ్యింది. కానీ కొద్ది రోజులకే అతడి భార్య భర్తని వదిలి పుట్టింటికి వెళ్లిపోయిందిట. భర్తకి విడాకులు ఇచ్చిందట. ఆ అబ్బాయిది చాలా మెత్తని మనసట. భార్య వదలిపెట్టింది అని నలుగురూ అనుకోవటంతో అతడికి మనసు చలించింది. దాంతో డిప్రెషన్‌కి లోనయి మతి చలించిందిట. పిచ్చివాడిలాగ తయారయి, ఉద్యోగం అశ్రద్ధ చేశాడట. దాంతో వాళ్లు తీసేశారట. ఎక్కడెక్కడో తిరిగి ఎప్పుడో ఇంటికి వచ్చేవాడట. ఒక్కోసారి రెండు మూడు నెలలు ఎక్కడెక్కడో తిరిగి వచ్చేవాడు. రోడ్డుమీద నివాసం. తండ్రి పట్టించుకోలేదు. కుటుంబాన్ని గాలికి వదిలేశాడు. పెద్ద కొడుకు తమ్ముణ్ణి సరిగా పట్టించుకునేవాడు కాదు. "అతని సంపాదన అంతంత మాత్రం. చిన్న బిజినెస్. ఆ పని అశ్రద్ధ చేస్తే బ్రతకటం కష్టం. అస్తమానం ఎక్కడని వెదుకుతాం. వాడే వస్తాడులే" అనేవాడుట.

"నేను ఎక్కడని వెదుకుతాను? నా దగ్గర డబ్బు లేదు. మొన్న ఎవరో అన్నారు– వరంగల్‌లో ఎక్కడో కనిపించాడని" అనేది సీతమ్మగారు దిగులుగా కొడుకుని తల్చుకుంటూ.

"వాన వచ్చినపుడు వాడు జ్ఞాపకం వస్తే నిద్ర పట్టదు. ఈ వానలో చలిలో ఏ రోడ్డు పక్కన పడివున్నాడో, తిన్నాడో లేదో... తల్చుకుంటే నిద్రపట్టదు. ముద్ద నోటికి ఎక్కదు. ఎండాకాలం రోడ్ల మీద ఎలా తిరుగుతాడో. కాలికి చెప్పులన్నా ఉన్నాయో లేదో. ఇదివరకు మూడు నాలుగు నెలలకైనా ఇంటికి వచ్చేవాడు. ఇప్పుడు అసలే కనిపించటం లేదు" అనేది.

"పెద్దకొడుకు నాలుగయిదు ఇళ్లు మారాడు. వాడు ఇంటికి వచ్చినా ఎక్కడని వస్తాడు? ఇలా ఇళ్లు మారుతున్నాం" అనేది గుబులుగా.

"బంగారం లాంటి బ్యాంకు ఉద్యోగం. పాడుచేసుకున్నాడు. పెళ్లాం వదిలి పెట్టిందని మనసు చెడగొట్టుకున్నాడు. అక్కడికి నేను ఎంతో నచ్చజెప్పాను. అయినా వాడి మనసు చక్కదిద్దుకోలేకపోయాడు" అనేది చెక్కిట చెయ్యి పెట్టుకుని ఎటో చూస్తూ.

"తండ్రి అయినా, అన్న అయినా శ్రద్ధ పెట్టి వాణ్ణి ఆసుపత్రిలో చేరిస్తే వాడు బాగయ్యేవాడు. కానీ తండ్రికే లేదు. ఇంక అన్నకేం ఉంటుంది? ఆయన కుదురుగా ఏదన్నా పని చేస్తే మేం ఇద్దరం ఏ చిన్నగదో అద్దెకు తీసుకుంటే నాకు గౌరవం వుండేది. అక్కడికీ చాలాసార్లు ఆయనకి చెప్పి చూశాను. కానీ ఆయన వినలేదు. దేశదిమ్మరి. ఎప్పుడో వస్తాడు. ఉన్న రెండు రోజులు సుబ్బరంగా తింటాడు. కానీ ఇప్పుడు అందుకు కూడా మా కొడుకు కోడలు రుసరుసలాడతారు" అంది సీతమ్మ.

"ఇంట్లోంచి ఎక్కడికైనా పొమ్మంటుంది నా కోడలు. కానీ ఎక్కడికి పోతాను? పోనీ ఏదన్నా చిన్న గది తీసుకుని వుందామన్నా నా సంపాదన సరిపోదు. నెలకి ఐదు వందలు కూడా వుండదు నా సంపాదన. ఏం చెయ్యాలో తోచటం లేదు" అంటుంది గుబులుగా.

"ఎక్కడన్నా వంటమనిషిగా వెళ్లండి. భార్యాభర్త డాక్టర్స్ అయిన వాళ్లున్నారు. కావాలంటే నే చూపిస్తా ఇల్లు. అక్కడే వుండొచ్చు. హాయిగా ఉంటుంది. పైగా జీతం కూడా ఇస్తారు. వాళ్లతోపాటు తిని ఉండొచ్చు. ఏదన్నా రోగం వచ్చినా చూస్తారు" అన్నాను ఒకసారి.

"చాలామంది ఆ మాటే అన్నారు. కానీ వున్న ఒక్క కొడుక్కి దూరం అవుతానేమో అనిపిస్తుంది" అంది.

"కానీ ఆ కొడుకు మిమ్మల్ని సరిగా చూడటం లేదు కదా. అమ్మా! అని పిలవడని మీరే అంటున్నారు. పొమ్మంటున్నారు కదా!" అన్నాను.

"నిజమే. కానీ నేను కన్నతల్లిని. వాడికి నేను అక్కర్లేదు. కానీ వాడు నాక్కావాలి. తల్లినై వుండి కఠినంగా నేను ఎలా వుండగలను? ఈ వయసులో నా పొట్ట కోసం వాడికి దూరం అవ్వాలంటే భయంగా వుంది. 60 ఏళ్లు వచ్చాయి. ఎన్నాళ్లు బతుకుతాను. ఏదో ఇలాగే సర్దుకుపోతాను" అంది.

"ఆమధ్య ఎవరో మా చిన్నబ్బాయిని చిక్కడపల్లి దగ్గర చూశామన్నారు. మా పెద్దాడికి చెప్పాను. ఒకసారి చూసి రారా. లేకపోతే పోలీసులకి చెప్పు" అన్నాను.

"చూద్దాంలే. నాకిప్పుడు తీరిక లేదు అన్నాడు" అంది ఇంకోసారి.

"చలికాలం వచ్చిందంటే వాడే జ్ఞాపకం వస్తాడు. వాడికి అసలు చలి పడదు. ఏ రోడ్డు పక్కన పడుకున్నాడో, ఏ జ్వరం అన్నా వచ్చిందేమో అని ప్రాణం కొట్టుకుంటుంది" అనేది సీతమ్మగారు.

"నేను ఏ జన్మలోనో పాపం చేసి వుంటాను. అందుకే నాకింత క్షోభ పెట్టాడు దేవుడు" అనేది ఆ గాజు కళ్లలోంచి నిస్తేజంగా చూస్తూ.

ఏం కొనకపోయినా తలుపు కొట్టి లోపలికి వచ్చి ఏదో మనసులో ఆవేదన చెప్పుకుని వెళ్లేది. కానీ రానురాను ఆవిడ వస్తూందంటే నాకు భయం వేసేది. ఆవిడ జీవితం నా మనసుని బరువెక్కించేది. అస్తమానం ఆవిడ మాటలు జ్ఞాపకం వచ్చి నిద్రపట్టేది కాదు. నిజంగా అలాంటి స్త్రీల బ్రతుకులు శాపగ్రస్త జీవితాలే అనిపించేది.

నాకు ఇక్కడికి బదిలీ అయ్యే ముందు ఒక సంచిలో కొన్ని రకాల డిజైన్ల లేసులు తెచ్చింది. తెల్ల దారంతో అల్లిన గుమ్మాల ఆర్చిలు. చాలా బాగున్నాయి. ఏనుగులు, నెమళ్లు, హంసలు, చిలుకలు... ఓ అరడజను పైగా తెచ్చింది. నన్ను ఒకటి తీసుకోమంది.

"ఇప్పుడు ఇవన్నీ ఓల్డ్ ఫ్యాషన్ కదా!" అన్నాను.

"నిజమే అనుకోండి. ఏదో అల్లాను. మీలాంటి వాళ్లు కొంటే నాలుగు రూపాయలు వస్తాయని ఆశ. నా చేతులో వున్న కళ ఇది ఒక్కటే. పరికిణీలకి కూడా వేసుకోవచ్చు. కావాలంటే అల్లిపెడతాను" అంది.

నాకు ఇష్టం లేకపోయినా గుమ్మానికి ఆర్చి ఒకటి కొన్నాను. చాలా సంతోషించింది.

"మీ ఆఫీసులో ఎవరికన్నా కావాలంటే చెప్పండి" అంది.

నవ్వి ఊరుకున్నాను.

లేసు తెర కొన్నాను గానీ దాన్ని వాడలేదు. ఆ ప్యాకెట్టు అల్మారాలో పడేశాను.

ఈ సామాన్లతో చూస్తుంటే ఇప్పుడది ఎంతో అపురూపంగా అనిపిస్తోంది.

తెల్లని సన్నని దారంతో అల్లిన నెమళ్ల డిజైన్ గుమ్మం ఆర్చి ఇప్పుడు మరుగునపడ్డాయి గానీ మన సంప్రదాయ కళలు, ఆడవాళ్ల చేతిపనులు చాలా గొప్ప కళాఖండాలు. సీతమ్మ గారి జీవితంలో లేని కళ ఆవిడ చేతిలో వుంది. ఆ కళ ఆవిడకి రెండు రూకలు సంపాదించి పెడుతోంది.

ఆ లేసు తెర చూడగానే ఆవిడ జీవితం కళ్లముందు కదిలింది. కొడుక్కి ఆవిడ అక్కర్లేదు. కానీ, ఆవిడకు కొడుకు కావాలి. చివరి రోజుల్లో కొడుకు చేతుల్లో పోవాలి. ఇదేనా తల్లి ప్రేమ అంటే?

ప్యాకెట్టు విప్పి లేసు తెరని గుమ్మానికి వేశాను.

చాలా అందంగా ఉంది.

పాత ఫ్యాషన్ నాకు అంతగా నచ్చదు. పేపర్ కర్టెన్స్ ఇష్టం. అలా అని ఆ తెరని పారెయ్యలేను. ముఖ్యంగా సీతమ్మ గారి జ్ఞాపకాలు నాకు భయం. మనసు బరువుగా అయి నిద్రపట్టదు. అయినా తప్పదు. ఆవిడ శ్రమతో అల్లిన లేసు తెరని పారెయ్యలేను. ఆ తెరని చూసినప్పుడల్లా ఆవిడ జ్ఞాపకం వస్తూంది. అయినా తప్పదు.

"మనసు గతి ఇంతే
మనిషి బ్రతుకింతే
మనసున్న మనిషికి
సుఖము లేదంతే" అన్నాడు ఓ కవి.

●

## మతం-మానవత్వం

మతం ఒక మంట
ఆర్పివేయి
మానవత్వం ఒక మొక్క
నీరుపోయి
మతం ఒక కారుచీకటి
తొలగనీయి
మానవత్వం ఒక కాంతిపుంజం
వెలగనీయి
మతం ఒక ముల్లు
పెరికివేయి
మానవత్వం ఒక మొగ్గ
పుష్పించనీయి
మతం ఒక బాకు
విరిచివేయి
మానవత్వం ఒక బాట
నడవనీయి
మతం ఒక రక్తాక్షరం
చెరిపివేయి
మానవత్వం ఒక శ్వేతపత్రం
మెరవనీయి
మతం ఒక కంటి నలక
తీసివేయి
మానవత్వం ఒక కంటిపాప
పెరగనీయి
మతం ఒక ఉన్మాదం
తరిమివేయి
మానవత్వం ఒక శాంతి పావురం
ఎగురనీయి

– మాదిరెడ్డి రత్నమంజరి